పనితీరుపై అనుమానం!.

రేషన్ దుకాణాలకు నాణ్యత లేని బియ్యం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే:

పేదల ప్రయోజనార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌దుకాణాల ద్వారా నామమాత్రపు ధరకు బియ్యాన్ని అందిస్తున్నాయి. అయితే.. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఇది ఆశించిన ఫలితాలివ్వడం లేదు. ప్రధానంగా నాణ్యతలేని బియ్యం సరఫరా కావడం దీనికి నిదర్శనం. ఫలితంగా ప్రజలకు ఉపయోగం అటుంచి ఇబ్బందులకు కారణమవుతోంది.

పరిశీలించకుండానే..

రైతుల నుంచి సేకరించిన ధాన్యం రైస్‌మిల్లులకు పంపిస్తారు. అక్కడ మరపట్టించిన తర్వాత బియ్యాన్ని గోదాములకు తరలిస్తారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా వాటిని రేషన్ దుకాణాలకు చేర్చుతారు. వాటి ద్వారా లబ్ధిదారులకు పంపిణీ జరుగుతుంది. ఈ క్రమంలో రైస్‌మిల్లుల నుంచి వచ్చే బియ్యం, గోదాముల నుంచి సరఫరా అయ్యే సమయంలో వాటిని పరిశీలించాలి. పంపిణీకి అనువుగా ఉన్నాయా లేదా అని నిర్ధారించాలి. ఇదంతా నిరంతరంగా జరగాల్సిన ప్రక్రియ. కానీ, ఇది నిర్లక్ష్యానికి గురవుతోంది. చెప్పాలంటే.. అనుమానాలకు తావిస్తూ అధికారుల పనితీరును ప్రశ్నార్థకం చేస్తోంది. రైస్‌మిల్లుల నుంచి వచ్చే బియ్యం నాణ్యంగా లేకపోయినా పట్టించుకోవడం లేదు. గోదాముల్లోనూ బియ్యం ఎలా ఉన్నాయని తనిఖీ చేపట్టడం లేదు. మామూలుగా వ్యవహరిస్తూ పంపిణీని పూర్తిగా అలక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగానే నూకలతో కూడినవి, వడ్లతో, ఇతర చెత్తతో నిండిన బియ్యం కూడా రేషన్ దుకాణాలకు సరఫరా అవుతున్నాయి. కొన్నిచోట్ల ఉప్పుడు బియ్యం కూడా వస్తున్నాయంటే పరిస్థితి ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు. కొందరు రైస్‌మిల్లుల నిర్వాహకులు అధికారులతో కుమ్మక్కై ఇలా నాసిరకమైన సరకును సరఫరా చేస్తూ చేతులు దులుపుకొంటున్నారనే వాదనలు కోకొల్లలు.

జిల్లాలోని మండలాలు :	19
మండలస్థాయి గిడ్డంగులు :	04
రేషన్ దుకాణాలు :	412
తెల్లరేషన్ కార్డుదారులు :	2,10,093



రేషన్‌దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం ఇవి. బియ్యం బదులుగా నూకలు, వడ్లు ఎక్కువగా ఉండటం వల్ల లబ్ధిదారులు తినేందుకు ఆసక్తి చూపడం లేదు. వచ్చినవి వదులుకోలేక కొందరు పశువులకు దాణాగా ఉపయోగిస్తున్నారు. ఇంకొందరు కోళ్లఫారాలు, డెయిరీ ఫాంలకు విక్రయిస్తున్నారు. మరికొందరు కిలో రూ.12 నుంచి రూ.15 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. నాణ్యతను పరిశీలించి, బాగుంటేనే అధికారులు బియ్యం సరఫరాకు అనుమతించాలి. కానీ, క్షేత్రస్థాయిలో అలా తనిఖీలు జరగడం లేదని స్పష్టమవుతోంది. మొక్కుబడిగా పంపిణీ నిర్వహిస్తున్నారనే అర్థమవుతుంది. తక్కువ ధరకు పంపిణీ చేస్తున్నామన్న కారణంతో ఇలా అడ్డదిడ్డంగా ఇవ్వడం సరికాదని, ప్రజల అవసరాలను అపహాస్యం చేయడం తగదని స్థానికంగా లబ్ధిదారులు మండిపడుతున్నారు.

డీలర్లు ప్రశ్నించినా..

బియ్యం నాణ్యతపై పలువురు డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పంపిణీ సమయంలో లబ్ధిదారులతో వాగ్వాదం తప్పదని, తినడానికి వీలుగా ఉన్న వాటినే సరఫరా చేయాలని సూచిస్తున్నారు. కానీ, గోదాముల్లో ఉన్న వ్యక్తుల్లో కొందరు ఇవేవీ పట్టించుకోవడం లేదు. లేనిపోని నిబంధనలు, ఇతర తిరకాసులను సాకుగా చూపిస్తూ, వారిని భయాందోళనకు గురిచేస్తూ బలవంతంగా బియ్యం అప్పగిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. దీంతో కొందరు చేసేదేమీలేక వారిచ్చిన బియ్యాన్నే దుకాణాల్లో పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారులతో తరచూ వాగ్వాదం తప్పటం లేదని పేర్కొంటున్నారు. ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే.. వారికి మంచి బియ్యం అందిస్తూ గొడవ కాకుండా చూసుకుంటున్నారు. బియ్యం సక్రమంగా లేకపోవడంతో కొందరు లబ్ధిదారులు తమవంతు కోటా తీసుకోకుండానే వెనుదిరుగుతున్నారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

దుర్గామాత నిమజ్జనానికి నామమాత్రంగా ఏర్పాట్లు

మెట్లపై బురద, చీకటితో ఇబ్బందులు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: దుర్గామాత విగ్రహాల నిమజ్జనానికి బాసరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ సంఖ్యలో విగ్రహాలు బాసరకు తరలివచ్చాయి. నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో చిమ్మచీకట్లో భక్తులు అవస్థలు పడ్డారు. వినాయక విగ్రహాల మాదిరిగా అమ్మవారి విగ్రహాలను గోదావరి వంతెన పైనుంచి నిమజ్జనం చేయరు. మెట్ల మీద విగ్రహాలను ఉంచి పూజలు చేసి నీటిలో వదులుతారు. స్నానఘట్టాల వద్ద దేవాదాయ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మెట్లపై ఉన్న బురదలో భక్తులు జారి పడ్డారు. తోటి భక్తులు వారిని కాపాడారు. నిమజ్జనం క్రేన్ సౌకర్యం కల్పించకపోవడంతో చీకటిలో నదిలో దిగితే ఏమవుతుందోనని భక్తులు భయాందోళనకు గురయ్యారు. గజ ఈతగాళ్లు, విద్యుత్తు దీపాలు లేకపోవడంతో చాలా మంది ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని నిమజ్జనం చేశారు. పోలీసు సిబ్బంది మాత్రం అక్కడ ఉండి భక్తులకు సూచనలు చేశారే తప్ప, మిగతా అధికారులెవరూ కనిపించలేదు.



నిమజ్జనానికి బాసరకు తరలివచ్చిన దుర్గామాత విగ్రహాలు

దంచి కొట్టిన వాన.. తడిసిన పంట ఉత్పత్తులు

భైంసా, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి సాధించిన పంట దిగుబడులను విక్రయించే వరకు రైతులను ప్రకృతి వెంటాడుతోంది. దసరా పండగ సందర్భంగా మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిపి వేయడంతో సోమవారం భారీగా సోయా, మొక్కజొన్నలను రైతులు మార్కెట్‌కు తరలించారు. సుమారు 385 మంది రైతులు సోయా, మొక్కజొన్నలు, పెసర తదితర పంటలు తీసుకొచ్చారు. వాటి జల్లెడ పట్టడం, తూకం వేసే క్రమంలో సాయంత్రం ఒకే సారి భారీ వర్షం దంచి కొట్టడంతో టార్పాలిన్‌లు తీసుకొచ్చి కప్పేలోపు తడిసి ముద్దయ్యాయి. గంజ్‌లో పల్లపు ప్రదేశంలో ఉంచిన సోయా, మొక్కజొన్నల కుప్పలు నీట మునిగాయి. నీటిలో తడిసిన సరకును కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు. సోయా 5,265 క్వింటాళ్లు, మొక్కజొన్నలు 350, పెసలు 50 క్వింటాళ్లు మార్కెట్‌కు వచ్చాయి.



భైంసా గాంధీ గంజ్‌లో తడిసిన సోయా పంటను కుప్ప చేస్తున్న మహిళ

బుద్ధుడి మార్గంలో నడుచుకోవాలి

భైంసా, న్యూస్‌టుడే: దేశంలో శాంతి, సమసమాజ నెలకొల్పేందుకు బుద్ధుడి బోధనలు అలవర్చుకోవాలని బీఎస్‌ఐ ట్రస్టు ఛైర్మన్, ధమ్మ గురువు చంద్రబోధి పాటిల్ అన్నారు. పట్టణంలోని శ్రీనగర్ బుద్ధవిహార్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి బౌద్ధ దీక్ష ప్రసాదించారు. ముందు బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బుద్ధ ప్రార్థనలు చేశారు. అనంతరం బుద్ధవిహార్‌లో బుద్ధుని బోధనలు వివరించి ఆయన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, ప్రధాన కార్యదర్శి శీలం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కొంతం మురళి, కార్యదర్శి భుజంగ్‌రావు, పాండురంగ్ జాదవ్, బౌద్ధ బిక్షువులు, ఉపాసిక, ఉపాసకులు పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

పాఠశాలల ఎంపికకు నేడు కౌన్సెలింగ్

నిర్మల్, న్యూస్‌టుడే: ఉద్యోగ నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయ అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో పాఠశాలల ఎంపికకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు పొందిన స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉదయం 11 గంటలకు, ఎస్జీటీలకు మధ్యాహ్నం ఒంటి గంటకు కౌన్సిలింగ్ జరుగుతుందని, అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.




బేల మండలం ఇంద్రానగర్‌కు చెందిన ఇతడి పేరు సిరాజ్. వేసవిలో భార్యతోపాటు చేసిన కూలీ పనికి వచ్చిన రూ.12 వేల డబ్బులు అధికారులు చెల్లించటం లేదు. ఇతడిలా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పేదల గోడును అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను సైతం పారదర్శకంగా ఉన్నట్లు నమ్మించటంలో సిద్ధహస్తులైన కొంత మంది అధికారులు, సిబ్బంది కారణంగా పనుల నిర్వహణ అంతా ఆగమాగంగా ఉంది. రోజు కూలీ రూ.300 దక్కేలా పనులు చూపించాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో సగటు కూలీ రూ.218, ఆదిలాబాద్ జిల్లాలో రూ.238కే పరిమితం చేయటం కూలీల పాలిట శాపంగా మారుతోంది.

◆ ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, అంకోలి గ్రామాల శివారులో కాకుండా 5 కి.మీ దూరంలో పనులు చూపించిన విషయం జిల్లా అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు దృష్టికి వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. పని కావాలని మొరపెట్టుకున్నా.. కూలీల గోడు వినలేదు.

ఇచ్చి 'పుచ్చుకుంటున్నారు'

ఈటీవీ ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు గాడి తప్పుతోంది. అధికారుల పర్యవేక్షణలోపంతో పనుల నిర్వహణ అక్రమాలకు దారి తీస్తోంది. జిల్లాకు ప్రత్యేకంగా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి(అడిషనల్ డీఆర్‌డీవో) ఉన్నప్పటికీ పనుల నిర్వహణలో పారదర్శకత కనిపించటం లేదు. పైగా కొంతమంది అధికారులు సామాజిక తనిఖీల్లో బయట పడకుండా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుండటంతో ఈ అవినీతి తతంగం వెలుగు చూడటం లేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి రావటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఒక్కొక్కరికి రోజు కూలీ రూ.300 నిర్ణయించినప్పటికీ రూ. 250 దాటలేదు.



సామాజిక తనిఖీల్లో వెలుగు చూడని అవినీతి తతంగం

ఆదివాసీలకు అన్యాయం

ఆసిఫాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న అక్రమాలు బయటకు పొక్కకుండా క్షేత్రస్థాయిలో సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొంత మంది సిబ్బంది బినామీ వ్యక్తుల పేరిట లబ్ధి పొందే దందా సాగుతోంది. ఇటీవల ఆసిఫాబాద్ మండలంలో 27 పంచాయతీలు ఉంటే 19 పంచాయతీల పరిధిలోని పనుల్లో రూ.3,68,900 నిధులు దుర్వినియోగం అయినట్లు తేలింది. జిల్లాలోని 15 మండలాల్లోని 335 పంచాయతీల పరిధిలోని అక్రమాలను సర్దుబాటు చేసే ప్రయత్నం జరుగుతోంది. కూలీల్లో అత్యధికులు ఆదివాసీలే కావటంతో అధికారులు చెల్లించిందే వేతనం అన్నట్లు నమ్మించే ప్రయత్నం జరుగుతోంది.

జిల్లాల వారీగా వివరాలు.. (■ మండలాలు ■ పంచాయతీలు)

జిల్లా	మండలాలు	పంచాయతీలు
ఆదిలాబాద్	17	473
నిర్మల్	18	400
ఆసిఫాబాద్	15	335
మంచిర్యాల	16	311

మంచిర్యాలలో ఇలా..

మంచిర్యాల జిల్లాలో కూలీలకు పనులు చూపించడానికంటే నేతల సిఫారసులకే అధికారులు ప్రాధాన్యమిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సింగరేణి ప్రాంతమైనందున కూలీ పనులకు గ్రామీణులు ముందుకురారని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవటం అధికారులకు కలిసి వస్తోంది. కోటపల్లి మండలంలోని 31 పంచాయతీల్లో రూ.5.01 కోట్ల పనులు జరిగితే రూ.4.84 కోట్ల చెల్లింపులు జరిగినట్లు తేలింది. మరో రూ.17,72,917 తేడాలున్నట్లు దృష్టికిరాగా రూ.26,116 రికవరీకి ఆదేశించారు. చెన్నూరు మండలంలోని 30 పంచాయతీల పరిధిలో దుర్వినియోగమైన రూ.51 వేలు రాబట్టినట్లు నివేదికలు తయారు చేయటం అధికారుల పనితనాన్ని వెల్లడిస్తోంది.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు: ఎమ్మెల్యే



ముథోల్: కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పటేల్

తానూరు(భైంసా), న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. తానూరు మండల కేంద్రంలోని డాంగెపెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో హంగిర్గ పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించబోమని చెప్పారు.

ముథోల్: కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ కోరారు. మండలంలోని బోరిగాం సహకార సంఘం గోదాంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎకరానికి 6 క్వింటాళ్ల సోయా మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పది క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగాచరణ్, డీఎం ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్లు నారాయణరావుపటేల్, వెంకటేశ్ గౌడ్, భాజపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అపోహలు వీడేలా.. చెల్లుబాటయ్యేలా

● పది నాణెంపై బ్యాంకు సిబ్బంది ప్రచారం

న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో ఉన్న అపోహను తొలగించి వాటిని అన్ని వర్గాలతో వాడకంలోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు దుకాణ దారులు, ఇటు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి వాటి చలామణి పెంచేందుకు వీలుగా ప్రచారాన్ని ప్రారంభించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నాణేల చట్టబద్ధతపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది.



లక్షెట్టిపేటలో దుకాణదారులకు పది రూపాయల నాణేలు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది.

చిల్లర డబ్బుల కొరత

చిల్లర డబ్బుల చలామణి మామూలుగా కూరగాయల మార్కెట్లు, చిరు వ్యాపారులు, పాన్ దుకాణాలు, చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఎక్కువగా సాగుతాయి. పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావన్న అపోహ ప్రజల్లో బలంగా నాటుకుపోయిన కారణంగా అక్కడ కూడా తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో చిరిగిన, నలిగిపోయిన నోట్లు తీసుకుంటున్నారు తప్ప వీటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్లో చిల్లర డబ్బుల కొరత తీవ్రంగా మారింది.



ఇదీ సమస్య

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను 2005లో తొలిసారిగా ముద్రించింది. 2019 వరకు ఆయా సందర్భాలను బట్టి 14 సార్లు ఇవి విడుదలయ్యాయి. అన్ని రకాల నాణేలు చెల్లుబాటులో అవుతాయని రిజర్వు బ్యాంకు పలుమార్లు స్పష్టం చేసినా వాటి చలామణి దాదాపు నిలిచిపోయింది. అవగాహన ఉన్న కొందరు వాటిని వాడుదామనుకున్నా ఎదుటి వ్యక్తులు వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో బహిరంగ మార్కెట్‌లో వాడకం నిలిచిపోయింది. పది రూపాయల నోట్లు మార్కెట్లో ఉన్నప్పటికీ చేతులు మారేకొద్దీ అవి చినిగి పనికి రాకుండా పోతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంకు పది రూపాయల నాణేలు ముద్రిస్తున్నా వాటి చలామణి నిలిచిపోవడం సమస్యగా మారింది.

ఏం చేస్తున్నారంటే...

బ్యాంకు పరిధిలోని మార్కెట్లు, దుకాణాలు, రైతు బజార్‌లు, ప్రధాన మంత్రి స్వనిధి లబ్ధిదారులను కలిసి వారికి పది రూపాయల నాణెం చలామణికి సంబంధించి చట్టబద్ధతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 15వ తేదీన కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకు సిబ్బంది తమ కరెన్సీ చెస్ట్ నుంచి కనీసం పది నాణేలు తీసుకుని వాటిని అన్ని వర్గాలకు పంపిణీ చేసి చలామణిలోకి తీసుకొచ్చేలా ప్రచారం చేస్తున్నారు. తర్వాత రోజుల్లో బ్యాంకు సిబ్బంది లావాదేవీల సందర్భంగా ప్రతి వినియోగదారుడికి నగదు చెల్లింపుల సందర్భంగా నిర్ణీత మొత్తంలో నాణేలు అందజేయనున్నారు. దీంతో మార్కెట్‌లో చిల్లర సమస్య తొలగనుంది.

తీసుకోవడానికి నిరాకరిస్తే చర్యలు

పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావనేది అపోహ మాత్రమే. గతంలో పలుమార్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నాణేల చట్టబద్ధతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు.

- బిశ్వనాథ్ బోయ్, బ్రాంచి మేనేజర్, యూనియన్ బ్యాంకు, లక్షెట్టిపేట

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలి

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించటం బాగానే ఉన్నా.. దొడ్డు ధాన్యానికి ఎందుకు ఇవ్వటం లేదని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని పీచరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం పది రకాల పంటలకు బోనస్‌తో పాటు, గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటించినా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇటీవల హైదరాబాద్‌లో దీక్ష చేసినట్లు తెలిపారు. రైతులకు ఇప్పటికీ రూ.2లక్షల రుణమాఫీ జరగలేదన్నారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. రైతుల పంటకల్లాల నిర్మాణం స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని, లక్ష్మణచాంద నుంచి సోన్ వరకు రహదారి నిర్మాణానికి హామీ ఇచ్చారు. డీసీసీబీ వైస్‌ఛైర్మన్ రఘునందన్‌రెడ్డి, జిల్లా నాయకులు అడ్వాల రమేష్, ఎర్ర ముత్యంరెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, రాజేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీరాం, తహసీల్దార్ జానకి, వ్యవసాయాధికారి వసంత్‌రావు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



పీచరలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీ స్వీకరిస్తున్న జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్

నిర్మల్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వెనువెంటనే ఆ సమస్యలు తీర్చడానికి కృషి చేయాలన్నారు. సమస్యల వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో నమోదు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం చెల్లించరూ..




నా పేరు బత్తుల రవీందర్. కడెం మండలం పెద్ద బెల్లాల్ గ్రామం. మా నాన్న బత్తుల నర్సయ్య ఈ ఏడాది ఫిబ్రవరి 1న సౌదీ అరేబియాలో ప్రమాదవశాత్తు మరణించాడు. మా అమ్మ, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన మేము రోజూ కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాం. గల్ఫ్ దేశంలో మరణించిన కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయించి ఆదుకోవాలని ప్రార్థిస్తున్నా.

పట్టా పాసు పుస్తకం ఇప్పించండి



నా పేరు మేక గంగాధర్. నిర్మల్ మండలం తల్వేద గ్రామం. ఒక ఎకరం భూమికి సంబంధించి పట్టా పాసుపుస్తకం ఆన్‌లైన్‌లో ఉన్నట్లు చూపిస్తున్నా నాకు ఇవ్వలేదు. ఈ విషయమై తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని ఏడాదైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. నా భూమికి సంబంధించి కొత్త పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతున్నా.

నా భూమి అమ్ముకోనివ్వడం లేదు



నా పేరు ముత్తె లచ్చవ్వ. ఖానాపూర్ మండలం రంగపేట గ్రామం. చనిపోయిన నా భర్త భూమయ్య పేరుపై సర్వే నెంబరు 471/1లో 1.20 ఎకరాలు, 447లో 18 గుంటల భూమి నా పేరుపై వచ్చింది. ఇందులో 1.20 ఎకరాల భూమిని నా ముగ్గురు కుమారులకు సమానంగా ఇచ్చాను. మిగతా 18 గుంటల భూమిని విక్రయించి వచ్చే డబ్బును వృద్ధాప్యంలో ఉన్న నా ఆరోగ్య అవసరాలకు బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని నిర్ణయించుకున్నా. ఈ భూమి అమ్మడానికి ప్రయత్నిస్తే కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారు. 90 ఏళ్లు ఉన్న నాకు పింఛన్ మంజూరు చేయించాలని విన్నవిస్తున్నా.

సస్యరక్షణతోనే దిగుబడి..

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:

ప్రస్తుతం వరిలో కలుపు పనులు పూర్తయ్యాయి. ముందుగా నాటు వేసిన చోట గొలకలు వేస్తున్నాయి. కర్ర గట్టిపడుతోంది. ఈ సమయం లోనే పంటలు కాపాడుకోవడం ఎంతో కీలకం. పంటను ఏమాత్రం అశ్రద్ధ చేసినా దిగుబడి తగ్గే ప్రమాద ముంది. అయితే పంట చేతికొచ్చే వేళ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల చీడలు ఆశించే ప్రమాదముంది. చీడలను పసిగట్టి నివారణ చర్యలు వాడి... సస్యరక్షణ చర్యలు వాడితేనే దిగుబడి వస్తుందని బెల్లం పల్లి కేవీకే శాస్త్రవేత్త డా.శివకృష్ణ వెల్లడించారు.

వరిలో ఇలా..

కంకినల్లి: ఈ పురుగు ఆశిస్తే గొలక నల్లగా మారుతుంది. దీని నివారణకు వర్షం లేని సమయంలో ఎకరాకు ఒక మి.ల స్పైరోమెసిఫెన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచుపురుగు: ఈపురుగు సోకితే పిలకలు చనిపోయి తెల్లకంకులుగా మారతాయి. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లేదా ఫాస్ఫమిడాన్ 2.0 మి.లీ లేదా అసిఫేటు 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



సాగు చేస్తున్న వరి

అగ్గితెగులు: గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల అగ్గితెగులు ఆశించే ప్రమాదం ఉంది.. దీని నివారణకు 0.6 గ్రా. ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీఐసోప్రోథయోలేన్ లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

దోమపోటు, సుడిదోమ: గోధుమ వర్ణపు దోమ, తెల్ల మచ్చ దోమ వరిపైరును ఆశించడం వల్ల కర్ర మొదళ్ల దగ్గర చేరి రసం పీలుస్తాయి. దీనివల్ల పైరు సుడులుసుడులుగా ఎండిపోతుంది. పొలంలో నుంచి నీటిని తీసివేసి 1.5ఎసిఫేటు 75 ఎస్‌పీ లీటరు నీటికి వరి పైరు మొదళ్లపై పడేట్లు పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఒక ఎకరానికి కార్బోఫ్యూరాన్ 10 జీ గుళికలు 10 కిలోలు లేదా బూప్రొఫెజిన్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి మొదళ్ల దగ్గర తడిచేలా పిచికారీ చేయాలి.

ఆకుముడత: గొంగళి పురుగు ఆకులు రెండు అంచులు కలిపి లోపలి నుంచే కర్ర ఆకుపచ్చ పదార్థాన్ని తినివేయడం వల్ల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు ఎసిఫేటు 1.5 గ్రాములు లేదా కార్బాఫ్ హైడ్రోక్లోరికామ్లం 2.0 గ్రాములు లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ లేదా మోనోక్రోటాపాస్ 1.6 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పత్తిలో సస్యరక్షణ చర్యలు: పత్తి ప్రస్తుతం కాయగట్టి పడే దశలో ఉంది. ఈ దశలో సస్యరక్షణ చర్యలు ఇలా...

రైతేరాజు

రసం పీల్చే పురుగు: ఈ పురుగు లార్వాలు మొగ్గలు, పువ్వులకు చిన్నరంధ్రాలు చేసి కర్రకు నష్టం చేకూరుస్తాయి. దీంతో మొగ్గలు, పువ్వులు రాలిపోతాయి. కాయలు, పిందెలను తింటూ నష్టం కలుగజేస్తాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 1మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేటు 0.5 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మచ్చల పురుగు: ఈ పురుగు లార్వాలు లేత కొమ్మలను కాయలను తొలచి నష్టం చేస్తాయి. ఇవి ఆశిస్తే కొమ్మ ఎండిపోయి, కాయలు రాలిపోతాయి. పురుగు ఆశించిన భాగాల్లో దీని విసర్జన పదార్థం కన్పిస్తుంది. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పది పంటలు.. ప్రతి రోజు ఆదాయం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : పట్టణానికి దగ్గరలో ఉన్న పల్లె రైతులు రోజు వారీ ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించారు. ఒకటి, రెండు పంటలతో సరిపెట్టకుండా.. కూరగాయలు, పూలు తదితర పంటలు సాగు చేస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఇలాంటి రైతుల్లో తాంసి మండలం వడ్డాడికి చెందిన పోచ్చన్న ఒకరు. వడ్డాడిలో కొంత భూమి ఉన్నా.. రోడ్డు పక్కన పట్టణానికి దగ్గరలో ఉండే పొన్నారిలో ఎకరం భూమి కౌలుకు తీసుకున్నారు. టమాటా, వంకాయ, బెండ, అలసంద, బజ్జిర, బీరకాయ కూరగాయలతో పాటు ఆకుకూరలు సాగు చేసి ఎప్పటికప్పుడు మార్కెట్‌కు తరలించేలా ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా కేంద్రానికి గ్రామం దగ్గరలో ఉండడం.. రోజు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడం సులువుగా ఉండటంతో కూరగాయలను సాగు చేసి రోజు ఆదాయం పొందవచ్చని భావించారు. సొంత భూమిలో పత్తి, సోయా సాగు చేసి, కౌలుకు తీసుకున్న భూమిలో ఒక పంట చేతికి రాగానే మరో పంట చేతికి వచ్చేలా కూరగాయలు సాగు చేశారు. ఎక్కువ దిగుబడి వస్తే టోకుగా విక్రయిస్తారు. పది రకాల పంటలు సాగుకు మొత్తంగా ఏడాదిలో రూ.5 లక్షల పెట్టుబడి కాగా, ఖర్చులు పోనూ ఎకరానికి రూ.2 లక్షల వరకు 6 లక్షల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ సీజన్‌లో మొన్నటి వరకు టమాట ధర తక్కువగా ఉండేది. ఇప్పుడు ఏకంగా కిలో రూ.80కి పైగా ఉంది. పూలు కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. పలు రకాల పంటల సాగుతో ఒక రకానికి ధర తగ్గినా.. మరో పంటతో ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.



పందిరిపై పంటతో రైతు పోచ్చన్న, వడ్డాడి, తాంసి

అదనం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

ఫోన్ నెంబరు: 99085 56659

ప్రశ్న : పత్తి పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటను ఆశించే పురుగులను నివారించడం ఎలా?

- రాకేశ్, జైనథ్

జవాబు : 5 మి.లీ వేప నూనె(1500 పీపీఎం) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న : కంది పంటలో మొక్క ఎదగాలంటే ఏం చేయాలి?


- ఆశన్న, బెల్లూరి

పాల దిగుబడి ఇలా...

ప్రస్తుతం గేదెలు ఎక్కువగా ఈనుతుంటాయి. చూడి గేదెలను సంరక్షణలో జాగ్రత్తలు తీసుకుంటేనే పాల దిగుబడి బాగా వస్తుందని పశువైద్యాధికారి ధన్‌రాజ్ వివరించారు. పచ్చిగడ్డితో బదులు నేపియర్, జొన్న కర్రలు, లవణాలు, సమీకృత దాణా అందజేయాలి. గడ్డి, జొన్న, నేపియర్ విత్తనాలు రాయితీపై పశువుల ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. పాల దిగుబడి కోసం గేదెలకు కాల్షియం బోరో గ్లూకోజ్ ఇంజక్షన్లు వేయించాలి. ముందస్తుగా టీకాలు వేయించి దోమలు లేకుండా చూడాలి. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

మీకు తెలుసా?

సార్వత్రిక చదువు..భవితకు వెలుగు



చెన్నూరు, న్యూస్‌టుడే:

చదువుకోవాలని కొందరికి ఆసక్తి ఉంటుంది. కానీ వివిధ కారణాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో పాఠశాల స్థాయిలోనే మధ్యలో ఆపేస్తుంటారు. ఇంకొందరు పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ విద్యకు వెళ్లకుండా మానేస్తుంటారు. మళ్లీ చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారికి తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ సదవకాశం కల్పిస్తోంది. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌లోనూ ప్రవేశాలు అందుబాటులోకి వచ్చాయి. డిగ్రీ, పీజీలు కూడా చేయొచ్చు. ఏటా వేలాది మంది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశాలు తీసుకుంటూ చదువుపై దృష్టి పెడుతున్నారు. అయితే దీన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొలువులు సాధిస్తున్న నేపథ్యంలో కథనం.

దరఖాస్తు ఇలా..

ఓపెన్ పది, ఇంటర్‌లో ఈ విద్యా సంవత్సరం 2024-25లో ప్రవేశాలు పొందడానికి అపరాధ రుసుముతో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

డిగ్రీ, పీజీకి అవకాశం

ఓపెన్ పది, ఇంటర్ పూర్తి చేసిన అభ్యాసకులు దూరవిద్యావిధానం ద్వారా డిగ్రీ ఆ తరువాత పీజీ చదువొచ్చు. ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన వారు రెగ్యులర్‌గా లేదంటే దూరవిద్యా విధానం ద్వారా డిగ్రీ చదవాలి. డిగ్రీ పూర్తి చేసిన వారు దూరవిద్యావిధానం ద్వారా లేదంటే రెగ్యులర్‌గా పీజీ చదువుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు కాకతీయ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు దూర విద్యావిధానం ద్వారా పీజీ చేసే అవకాశం కల్పించాయి.



ఓపెన్ స్కూల్‌కు హాజరైన అభ్యాసకులకు బోధిస్తున్న అధ్యాపకుడు



లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన చెలిమెల రాజు స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో స్థానం, భాషా(తెలుగు) పండితుడిగా మూడో స్థానంలో ర్యాంకు సాధించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి వరకు చదువుకొని మానేశాడు. అనంతరం స్వయం ఉపాధి పొందారు. 2008-2011లో దూర విద్యలో డిగ్రీ చదివారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తి చేశారు. గురుకుల పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. డీఎస్సీకి సిద్ధమై మరో ఉద్యోగం సాధించారు. ఆర్థిక పరిస్థితులతో చదువు మధ్యలో మానేసినా నిరాశ చెందకుండా దూరవిద్యావిధానంతో తన లక్ష్యాన్ని సాధించి పలువురికీ ఆదర్శంగా నిలిచారు.

- చెన్నూరు ఓపెన్ పది, ఇంటర్ కేంద్రాల్లో చదువులు పూర్తి చేసిన ఎంతో మంది రెవెన్యూ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు సాధించారు.
- ఓపెన్ ఇంటర్ పూర్తి చేసిన కాసిపేట మండలానికి చెందిన ఓ అభ్యాసకుడు 2018లో నీట్‌కు అర్హత సాధించాడు.

రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు

- అశోక్, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

ఓపెన్ స్కూల్ విద్యకు రెగ్యులర్‌తో సమాన గుర్తింపు ఉంది. పది పూర్తిచేసిన వారు ఆపై విద్యకు, ఇంటర్ పూర్తి చేసిన వారూ ఉన్నత విద్యకు అర్హులే. ప్రభుత్వ రంగంలో చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి పదోన్నతులకు అవకాశం ఉంటుంది. ఓపెన్ ఇంటర్ చదివిన వారికి గత ప్రభుత్వంలో పదోన్నతులు, ఉద్యోగాలు కూడా సాధించారు.

సీతాఫలం @ పీచర



చెట్టుపై

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: కాలనుగుణంగా, ప్రకృతి పరంగా లభించే ఫలాల్లో సీతాఫలాన్ని అందరూ ఇష్టపడుతారు. మధురమైన సీతాఫలాలకు లక్ష్మణచాంద మండలం పీచర గ్రామం ప్రసిద్ధి. ఈ గ్రామంలో సీతాఫలం చెట్టులేని తోట ఉండదంటే అతిశయోక్తి కాదు. పీచరలోకి ప్రవేశించే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు స్వాగతం పలుకుతాయి. తమ పరిధిలోని తోటల్లో, రహదారుల వెంట ఏ ఒక్క రైతు వీటిని నాటలేదు. ప్రకృతి పరంగా మొలిచిన చెట్లను రక్షిస్తుండటంతో ఏపుగా పెరిగి రైతులకు శీతాకాలంలో అదనపు ఆదాయాన్ని ఇస్తున్నాయి. వర్షాకాలం ముగింపు.. సీతాకాలం ప్రారంభంలో స్థానిక రైతులు ఈ చెట్లకు కాపలాగా ఉంటారు. నిత్యం నిర్మల్‌కు తీసుకెళ్లటంతో పాటు, స్థానికంగా విక్రయిస్తుంటారు. నిర్మల్‌లోని ప్రధాన రహదారుల వెంట, మార్కెట్ ప్రాంతంలో గ్రామ మహిళలు విక్రయిస్తుంటారు. చెట్లపై పండిన పండ్లను నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తుండటంతో ఇక్కడి ఫలానికి అధిక డిమాండ్ ఉంటుంది. ఒక్కో ఫలానికి సైజును బట్టి రూ.15 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది. గ్రామంలోని దాదాపు పదిహేను కుటుంబాలు పండ్లు వచ్చినన్ని రోజులు విక్రయాలు జరుపుతుంటాయి. తన తోటలోని చెట్ల ద్వారా సుమారు రూ.50 వేల ఆదాయం సమకూరుతుందని స్థానిక రైతు తెలిపారు.



పీచర వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా సీతాఫలం చెట్లు



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, క్రీడా సంఘాల సభ్యులు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అట్టహాసంగా తైక్వాండో జోనల్ స్థాయి పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి (ఉమ్మడి జిల్లా) తైక్వాండో పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో స్థానిక సెవెన్‌హిల్స్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణి రాజా, పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మెరుగైన ఆటతీరుతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ రాణించిన వారిని త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఫణిరాజా తెలిపారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, శిక్షకుడు మండ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు రోహిత్, రాహుల్, శ్రావణ్, శ్రీజ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు చూసేద్దాం..

తెలంగాణ దర్శినికి ప్రభుత్వం శ్రీకారం

న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ : కొత్త ప్రాంతాల్లో పర్యటించాలన్న ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 'తెలంగాణ దర్శిని'కి శ్రీకారం చుట్టింది. రెండో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది. ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

సెలవుల తర్వాత.. ఎకో టూరిజం, ఆర్ట్, క్రాఫ్ట్, వారసత్వం, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సెప్టెంబరు 29న జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో దసరా సెలవుల తర్వాత అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇప్పటికే కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాల సందర్శన మొదలైంది. ఇటీవల కళాశాలలో టూరిజం క్లబ్ ఏర్పాటు చేసి స్థానిక త్రిశూల్ పహాడ్‌పై ఉన్న ఆలయ సముదాయాలను సందర్శించారు. త్రిశూల్ పహాడ్‌ను పర్యాటక ప్రదేశంగా మార్చడానికి ఏర్పాటు చేయాల్సిన వసతులపై విద్యార్థులు నమోదు చేసుకున్నారు.



కోసిని రిజర్వాయర్ వద్ద విద్యార్థులకు జాతీయ విపత్తుల రక్షణ దళం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



త్రిశూల్‌పహాడ్‌పై పర్యటనలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తరగతుల వారీగా వివరాలు

విభాగం	తరగతులు	రోజులు	దూరం	ఒక్కో విద్యార్థికి ఖర్చు(రూ.లలో)
1	2-4	ఒక రోజు	స్థానికం (మండల పరిధి)	300
2	5-8	ఒక రోజు	20-30	800
3	9-ఇంటర్	రెండు రోజులు	50-70	2000
4	డిగ్రీ	నాలుగు రోజులు	రాష్ట్రంలో ఎక్కడైనా	4000

సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం



తెలంగాణ దర్శిని కార్యక్రమం విద్యార్థులకు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చారిత్రక ప్రదేశాలు, ఇతర పర్యాటక ప్రదేశాలపై ప్రత్యేక అవగాహన ఏర్పడుతుంది. వారసత్వ సంపదను కాపాడుకోవడంలో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది.

- వాసాల ప్రభాకర్, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్

పర్యాటక రంగ అభివృద్ధికి దోహదం



విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శిని ఎంతగానో ఉపయోగపడనుంది. పర్యాటక రంగంలో వస్తున్న మార్పులు, ఉద్యోగ అవకాశాలను సైతం డిగ్రీ విద్యార్థులకు వివరించి పర్యాటక రంగంలో ఉపాధి పొందేలా ప్రణాళికలు తయారు చేస్తాం.

- లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల. కాగజ్‌నగర్

బాసరలో ప్రసాదాల కొరత

మూడు గంటల పాటు భక్తుల నిరీక్షణ

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా సోమవారం బాసరలోని సరస్వతి ఆలయంలో ప్రసాదాల కొరత ఏర్పడింది. బాసర గోదావరి నదిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో సరస్వతి అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దర్శనం అనంతరం భక్తులు ఉదయం 9.30 గంటలకు ప్రసాదాల టిక్కెట్ కొనుక్కుని కౌంటర్‌కు వెళితే నిల్వ లేవు. ప్రసాదం వస్తోందంటూ భక్తులను మూడు గంటల పాటు ఆపారు. విసుగు చెందిన కొందరు టికెట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని అధికారులను నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందని మండిపడ్డారు. తరచూ ఇలాగే జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. తీరా మధ్యాహ్నం రెండు గంటలకు చిన్న లడ్డూలను కౌంటర్‌కు తీసుకువచ్చారు. అప్పటికే పలువురు భక్తులు ప్రసాదాలు తీసుకోకుండానే వెనుతిరిగారు. ఆదివారం దసరా ఉండటంతో సోమవారం భక్తులు తక్కువగా వస్తారనే అంచనాతో ప్రసాదాల తయారీని నిలిపివేశారు. ఒక్కసారిగా భక్తులు తరలిరావడంతో కొరత ఏర్పడింది. గత సంవత్సరం ఇదే సందర్భంలో సిద్ధం చేసిన ప్రసాదాలు విక్రయం కాక గ్రామం చివరన కాల్చివేశారు. ఆలయానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడం, సిబ్బంది కొరతతో పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు అంటున్నారు. సమస్యపై 'న్యూస్‌టుడే' ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావును చరవాణిలో సంప్రదించగా భక్తుల సంఖ్య ఊహించిన దానికి భిన్నంగా ఉండి సమస్య తలెత్తిందని, పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

స్టేషన్‌లో పోలీసు సిబ్బంది మధ్య గొడవ

సిరికొండ, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బంది మధ్య జరిగిన గొడవ స్థానికంగా విమర్శలకు తావిస్తుంది. ఆదివారం రాత్రి ఇద్దరు సిబ్బంది మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చుట్టుపక్కల వారు గమనించడంతో వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సోమవారం సీఐ భీమేష్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' సీఐని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

ఉద్యోగుల బరి.. లక్ష్యంపై గురి

రాష్ట్ర, జాతీయస్థాయి హాకీ పోటీల్లో రాణింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం:

వీరంతా మూడు పదుల వయసు దాటినవారు. చిన్నప్పుడు ఇష్టంతో ఎంచుకున్న హాకీ ఆటలో మెరుపులు మెరిపించారు. ఇప్పటికీ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఉన్నతంగా చదువుకుని ప్రభుత్వ కొలువులు సాధించారు. తాజాగా హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే నిలయం ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు.

నిత్యం సాధన



సీనియర్ నేషనల్స్	1
సీనియర్ రాష్ట్రస్థాయి	6
యూనివర్సిటీ గేమ్స్	2
రాష్ట్రస్థాయి పోటీలు	30

ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ 2000 సంవత్సరంలో హాకీ ఆటకు ఆకర్షితులయ్యారు. నిత్యం ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో సీనియర్ల వద్ద మెలకువలు నేర్చుకున్నారు. రైట్ బ్యాక్ స్థానంలో ఆడుతూ ప్రత్యర్థులు కొట్టే బంతులను గోల్స్ కాకుండా అడ్డగించడంలో ప్రావీణ్యం పొందారు. 2013లో క్రీడా విభాగంలో ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి ఇచ్చోడలో విధులు నిర్వహిస్తున్నారు.

దేశానికి ఆడాలని..



నేరడిగొండ మండలం ఫటఫటితాండ గ్రామానికి చెందిన ఆడే అశోక్‌కుమార్. హాకీలో దేశానికి ఆడాలని లక్ష్యం పెట్టుకున్నారు. గోల్ కీపింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. 2012లో క్రీడా విభాగంలో పోలీసు ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర జట్టుకు పలుమార్లు సారథిగా వ్యవహరించి జట్టును ఒంటిచేత్తో గెలిపించారు.

సీనియర్ నేషనల్స్	4
జూనియర్ నేషనల్స్	4
ఆలిండియా పోలీసు క్రీడలు	10
బెంగుళూరు, పూణే, ఖరగ్‌పూర్ లీగ్ పోటీలు	3
రాష్ట్రస్థాయి పోటీలు	51

నిరంతర విద్యార్థి



ఆదిలాబాద్‌లోని కుమ్మరివాడకు చెందిన యెగిడి శేఖర్ 2006 నుంచి సీనియర్లతో కలిసి హాకీ ఆడుతున్నారు. బెంగుళూరులో ఏడాదిపాటు ఎన్ఐఎస్ హాకీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. 2019లో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ శిక్షకుడిగా ఉద్యోగం సాధించారు. విద్యార్థులను శిక్షణనిస్తూ, సీనియర్స్ విభాగంలో స్వయంగా పోటీల్లో పాల్గొంటున్నారు.

సీనియర్ నేషనల్స్	2
కేయూ, ఓయూ గేమ్స్	4
పైకా	1
రాష్ట్రస్థాయి పోటీలు	34

మైదానమే నేస్తం



సీనియర్ నేషనల్స్	5
యూనివర్సిటీ గేమ్స్	5
రాష్ట్రస్థాయి	21
పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్(పైకా)	1

ఆదిలాబాద్ శాంతినగర్ కాలనీకి చెందిన పెద్దివార్ శ్రీనివాస్ 2004 నుంచి హాకీ ఆడుతున్నారు. సీనియర్ క్రీడాకారుల వద్ద శిక్షణ పొందారు. సమయం దొరికితే మైదానంలో సాధన చేస్తుంటారు. సెంటర్ ఫార్వర్డ్‌లో చురుకుగా కదులుతూ గోల్స్ చేయడంలో దిట్ట. జిల్లా, రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించి పలుమార్లు జట్టును విజయపథంలో నడిపించారు. ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో రెండేళ్లుగా కోచ్‌గా పని చేస్తున్నారు.

ఆటే శ్వాసగా



సీనియర్ నేషనల్స్	1
జూనియర్ నేషనల్స్	1
యూనివర్సిటీ గేమ్స్	4
అండర్-19 ఎస్‌జీఎఫ్ నేషనల్	1
రాష్ట్రస్థాయి పోటీలు	22

ఆదిలాబాద్‌లోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఆత్రం అతుల్ 2003లో హాకీపై మక్కువ పెంచుకుని సీనియర్ క్రీడాకారులతో కలిసి సాధన చేశారు. లెఫ్ట్ బ్యాక్‌లో ఆడుతూ ప్రత్యర్థి జట్టు గోల్స్ చేయకుండా చాకచక్యంగా ఆపడంలో మెరిక. కాకతీయ విశ్వవిద్యాలయం జట్టుకు, అండర్-19 తెలంగాణ జట్టుకు సారథిగా వ్యవహరించారు. 2020 నుంచి నార్నూరులోని ఏకలవ్య ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



హాకీ సాధన చేస్తున్న ఉద్యోగులు

నీటి సమస్య తీర్చండి

? తానూరు మండలం మసల్గాలో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. స్థానికంగా ఉన్న బోర్లు పనిచేయడంలేదు. - గంగాధర్, స్థానికుడు

✔ పరిశీలించి తాగునీరు అందించే చర్యలు తీసుకుంటాం. - అబ్దుల్ సమద్, ఎంపీడీవో, తానూరు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ధర్మాబాద్‌కు చెందిన యువకుడు ఖనీ(26) మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలైనట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఖనీ తన స్నేహితుడు తాండోడుతో కలిసి బాసరలో జరిగే దుర్గామాత నిమజ్జనోత్సవం చూడడానికి ద్విచక్రవాహనంపై బాసరకు వచ్చారు. రాత్రి ధర్మాబాద్ వెళ్తుండగా ఆర్జీయూకేటీ సమీపంలో నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ద్విచక్రవాహనం నడుపుతున్న ఖనీకి తీవ్రగాయాలు, తాండోడు స్వల్పంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఖనీ మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహారాష్ట్ర రహదారిపై..


గజ్జారాం

కుభీరు: రాష్ట్ర సరిహద్దు రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పల్సి గ్రామానికి చెందిన మెండె గజ్జారాం(45) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిని గ్రామం నుంచి రాత్రి 11 గంటల సమయంలో పల్సి గ్రామానికి ద్విచక్రవాహనంపై బయలుదేరిన గజ్జారాంను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఆ సమయంలో ఓ వ్యాపారి పల్సిలో కొనుగోలు చేసిన సోయాను ట్రాక్టర్‌లో తీసుకుని మహారాష్ట్రలోని బోకర్‌కు వెళ్తున్నారు. కిని సమీపంలోని గుట్ట రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని మెండె గజ్జారాంగా గుర్తించారు. వెంటనే బోకర్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

డివైడర్‌కు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని ఎల్లాపూర్ గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నబీ ఖాన్(60) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై ఖానాపూర్ నుంచి నిర్మల్ వెళ్తుండగా ఎల్లాపూర్‌వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

డీజే నిర్వాహకులపై కేసు

భైంసా గ్రామీణం: దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా మండలంలోని కామోల్‌లో ఆదివారం అనుమతి లేకుండా డీజేను వినియోగించి, రెడ్డి యూత్, శివసేన యూత్ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన డీజే యజమాని అనికేత్ సురన్‌పై సైతం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా కల్యాణం


మంగళహారతులతో మహిళలు

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సుర్జాపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. అర్చకులు వక్రపాణి నరసింహమూర్తి, కోటపల్లి అనీష్, నిఖిలేశ్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం, వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కదిలి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

దిలావర్‌పూర్: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుటుంబ సమేతంగా సోమవారం కదిలి పాపహరేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమను తరలించేలా ప్రభుత్వానికి విన్నవించాలని మండల రైతులు హన్మంతరావుకు సమస్య వివరించారు. ఆలయ ఛైర్మన్ నార్వాడే వెంకట్రావు, ఈవో భూమయ్య, మండల కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, పరశురాం, విజయ్, రమణ, మాదవరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో..

కుంటాల: దసరా పండగను పురస్కరించుకుని జక్కుల పరివారం ఆధ్వర్యంలో కుంటాలలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గజ్జలమ్మ తండా అటవీ ప్రాంతంలోని గుట్టపై గల భీమున్ పాదాలు, సట్టి దేవత వద్ద భక్తి శ్రద్ధలతో సంప్రదాయ పూజలు చేశారు. గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా పోటెత్తుతుండటంతో తరతరాలుగా కుటుంబీకులు సైతం ఆనవాయితీని కొనసాగించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శారదాదేవి ఉత్సవాలు ప్రారంభం

భైంసా: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి శారదాదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం సంఘ భవనంలో మహిళలు శారదాదేవి విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. అయిదు రోజులపాటు దేవివ్రతం కొనసాగుతుంది. అందులో భాగంగా ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. అనంతరం శనివారం గడ్డెన్న జలాశయంలో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పట్టు పట్టి.. కొలువులు కొట్టి

● కష్టపడి ఉపాధ్యాయ వృత్తికి ఎంపికైన మహిళారాణులు

లోకేశ్వరం, న్యూస్‌టుడే: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉంటే కష్టమైనా ఫలితాన్ని సాధిస్తారనడానికి ఈ మహిళలే నిదర్శనం. ఇష్టపడివిద్దే చదువు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఎందరో పోటీ పడుతున్న నేటి రోజుల్లో 5-10 ఏండ్ల తరువాత చదువు పూర్తయి వివాహాలు చేసుకుని సంసార నావలో మునిగితేలుతున్నా వారి లక్ష్యాన్ని మాత్రం వీడలేదు.

కష్టపడి.. ఫలితం దక్కించుకుని..



మండలంలోని గడ్‌చంద గ్రామానికి చెందిన తుంగెన అనూష ఉపాధ్యాయ ఉద్యోగం దక్కించుకోవడానికి చాలా కష్టపడ్డారు. గడ్‌చందలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్, కరీంనగర్‌లో డీఎడ్ పూర్తి చేసి ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. 2018లోనే మంగేశ్ రావుతో వివాహం కాగా ప్రస్తుతం మామడ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

పాతికేళ్ల పోరాటం ఫలించింది



ఉపాధ్యాయ వృత్తికి ఎంపికైన పత్రాన్ని చూపుతున్న ఈ మహిళ కంగుల్‌వార్ శారద. కామారెడ్డి జిల్లా అచ్చంపేటలో తండ్రి లక్ష్మణ్‌రావు ప్రధానోపాధ్యాయుడు కావడంతో అక్కడే ప్రాథమిక విద్య పూర్తి చేసి, ఇంటర్ వర్నిలో చదివారు. ఇంటర్ పూర్తి కాగానే 2002లో లోకేశ్వరం గ్రామానికి చెందిన కల్యాణ్‌రెడ్డితో వివాహమైంది. అయినా ఆమె లక్ష్యాన్ని మరవలేదు. 2012లో సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ పూర్తి చేసుకుని 2022లో బీఎడ్ పూర్తి చేశారు. తన చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో లోకేశ్వరంలోని ఉన్నత పాఠశాలలో 2006 నుంచి విద్యావాలంటీరుగా పనిచేస్తూ లక్ష్యం వైపు అడుగులేశారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కామారెడ్డి జిల్లా నుంచి పరీక్షలకు హాజరైన శారద జిల్లా స్థాయిలో 44వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా ఎంపికయ్యారు. వీరికి రాజేశ్వర్‌రెడ్డి, దీపురెడ్డి కుమారులు. కాగా దీపురెడ్డి అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం గమనార్హం.

విద్యావాలంటీరుగా పనిచేస్తూ..



మండలంలోని రాజురా గ్రామానికి చెందిన లోలం భవిత ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో జిల్లా స్థాయిలో 40వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఈమె పదో తరగతి వరకు రాజురాలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ నిర్మల్‌లో, డీఎడ్ ఆదిలాబాద్‌లో పూర్తి చేసి 2018లో నిర్వహించిన డీఎస్సీలో 0.7 మార్కుల తేడాతో కొలువును చేజార్చుకున్నారు. మూడేళ్లుగా రాజురాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యావాలంటీరుగా పనిచేస్తూనే తన ప్రయత్నాన్ని కొనసాగించారు. 2024 ఫిబ్రవరిలో కన్నాపూర్ వాసి మురళితో వివాహం జరిగిన కొద్ది రోజులకే డీఎస్సీ నిర్వహించడం, అందులో ర్యాంకు సాధించి ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే



నిర్మల్ డీఈఓ నుంచి ఉపాధ్యాయ ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న ఈమె పేరు కల్లె పెల్లి మైథిలి. కడెం మండలం బెల్లాల్ వాసి. 1-5 వరకు మొర్రిగూడలో, 6-10 వరకు బోథ్‌లోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో, ఇంటర్ నచ్చన్ ఎల్లాపూర్‌లోని టీఎస్‌డబ్ల్యుఆర్ఈ కళాశాలలో పూర్తి చేశారు. మెదక్‌లో డీఎడ్ చదివారు. అనంతరం 2017-18లో కానిస్టేబుల్ ఉద్యోగం కోసం పరీక్షలు రాసి 2022 అక్టోబర్ 9న కానిస్టేబుల్‌గా ఎంపికై లోకేశ్వరం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. విధులకు హాజరవుతూనే ఇటీవల నిర్వహించిన డీఎస్సీకి హాజరయ్యారు. అందులో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. రెండేళ్ల కిందట కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అక్టోబర్ 9 నాడే ఉపాధ్యాయ వృత్తికి ఎంపిక పత్రాన్ని అందుకోవడం గమనార్హం.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


చంద్రశేఖర్ తివారికి జ్ఞాపికను బహూకరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి సూచించారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాసంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ ముఖ్య నేతలకు సూచనలు చేశారు. సమన్వయంతో పనిచేస్తూ బూత్‌స్థాయిలో క్రియాశీల సభ్యత్వం కొనసాగించాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వం, పార్టీ విధివిధానాలను ప్రజలకు వివరిస్తూ, ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలను ఎండగట్టాలని చెప్పారు. యువత భాగస్వామ్యం పెంచాలన్నారు. ప్రజలు భాజపావైపు ఆసక్తిగా చూస్తున్నారని, వారిని ఆకట్టుకునేలా క్షేత్రస్థాయిలో స్థానిక సమస్యలపై ఉద్యమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, నాయకులు అంజుకుమార్‌రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణానికి కీలకం

నిర్మల్ పట్టణం : పార్టీ సంస్థాగత నిర్మాణం, బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని భాజపా నేత, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఆయన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ఓట్లపరంగా, ఎంపీ సీట్ల పరంగా భాజపా రెండోస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. ప్రతీ ఆరేళ్లకోసారి నిర్వహించే సభ్యత్వనమోదుతో బూత్, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీల ఏర్పాటు సులభమవుతుందని చెప్పారు. కాంగ్రెస్, భారాస వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు ఇది కీలకమన్నారు. ఈనెల 15 నుంచి 24 వరకు ప్రత్యేక డ్రైవ్ కింద నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


ఖానాపూర్ మండలం సత్తనపల్లిలో..


ఖానాపూర్: బతుకమ్మలతో..


ఖానాపూర్‌లో కోలలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గీత కార్మికులకు కిట్ల పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 32 మంది గీత కార్మికులకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాల కింద సరఫరా చేసిన కిట్లను సోమవారం లోకేశ్వరంలోని రైతు వేదిక భవనంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని మన్మద్, ఎడ్బూర్-పొట్‌పెల్లి(బి), బాగాపూర్, పంచగుడి గ్రామాలలోని బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో భాజపా మండల కన్వీనర్ జయసాగర్‌రావు, నాయకులు రాజేశ్‌బాబు, మెండె శ్రీధర్, గంగారెడ్డి, భాస్కర్, సాయన్న, వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఉత్తం, బలిరాం తదితరులు పాల్గొన్నారు.

17న ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

నిర్మల్ పట్టణం: ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లవుతున్న తరుణంలో సంఘ నగరశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లాకేంద్రంలో పథ సంచలన్, విజయదశమి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నగర సంఘ్‌చాలక్ డా.తుమ్మల ప్రమోద్ చంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పడిగెల కృష్ణసంతోశ్, వక్తగా ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ హాజరవుతారని చెప్పారు.

వెళ్లిరావమ్మా... బతుకమ్మా


భైంసా మండలం వానల్‌పాడ్‌లో బతుకమ్మలతో చిన్నారులు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఖానాపూర్ పట్టణంలో సోమవారం రాత్రి సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి అందంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని ఆయా కాలనీల నుంచి మహిళలు బతుకమ్మ పాటలపై, కోలలు ఆడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. పోయిరావమ్మా... మళ్లీ రావమ్మా బతుకమ్మా అంటూ పాటలు పాడారు. అనంతరం సదర్మాట్ కాల్వలో, గోదావరిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్‌లో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు.

బంతిపూలకు భారీ డిమాండ్

ఖానాపూర్: సద్దుల బతుకమ్మ సందర్భంగా సోమవారం ఖానాపూర్ మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ పూలు అందుబాటులో లేక ధరలు పెరిగాయి. బంతిపూలను కిలో రూ.250-300 వరకు విక్రయించారు. చామంతి పూలు కిలో రూ.800-1000 చొప్పున విక్రయించారు. పెంచినా తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేశారు. గునుగు, మల్లెపూలు, ఎరుపు పూల ధరలు సైతం భారీగా పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు.


కడెం: మద్దిపడిగలో..

బకాయిలు చెల్లించే వరకు కళాశాలలు బంద్



నినాదాలు చేస్తున్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు

నిర్మల్, న్యూస్‌టుడే: ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు మూడేళ్లుగా రావాల్సిన బోధనరుసుముల బకాయిలు చెల్లించే వరకు మంగళవారం నుంచి కళాశాలల బంద్ కొనసాగిస్తామని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా బాధ్యులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ బోధన రుసుములు పెండింగ్‌లో ఉండటంతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని, అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేక కళాశాల భవనాలు అద్దె, కరెంటు బిల్లులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. బకాయిలు చెల్లించాలని మంత్రులు, సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందజేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. బకాయిలు చెల్లించే వరకు చేపట్టనున్న కళాశాలల బంద్‌కు పోషకులు, విద్యార్థులు, ప్రజలు సహకరించాలని కోరారు. సంఘ బాధ్యులు వెంకట్‌రెడ్డి, సాయిలు, అఖిలేష్‌కుమార్‌సింగ్, విఠల్‌రావు, వెంకటేశ్‌గౌడ్, బాలానంద్, రవి, లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, లోహిత్, వర్ధన్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మూసివేత

కుంటాల, కుభీరు, సారంగాపూర్, లోకేశ్వరం, భైంసా, ఖానాపూర్,మామడ: బోధన రుసుములు చెల్లించకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారుతోందని ఆయా డిగ్రీకళాశాలల నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ పిలుపు మేరకు కుంటాల మండలంలోని కల్లూరు వాసవి డిగ్రీ కళాశాలను సోమవారం మూసి వేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గట్టుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

✦ బోధన రుసుముల బకాయిలు విడుదల చేయాలని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ సట్ల రవి, సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం ప్రైవేటు కళాశాల అసోసియేషన్ పిలుపు మేరకు కుభీరులో వివేకానంద, తపస్వీ డిగ్రీకళాశాలను మూసివేసి అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు.

✦ సారంగాపూర్‌లోని ఏకలవ్య, పద్మావతి డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ చేపట్టనున్నట్లు ప్రిన్సిపళ్లు అహ్మద్ పాషా, పి.శ్రీనివాస్‌లు తెలిపారు.

✦ లోకేశ్వరంలోని వేదనిధి డిగ్రీ కళాశాలను మూసి వేశారు. సంఘం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బోయి సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

✦ సంఘం పిలుపుమేరకు ఖానాపూర్ పట్టణంలోని నాలుగు ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మూసి ఉంచారు.

✦ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదలయ్యే వరకు నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు మామడ ఏకశిల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలను మూసి ఉంచారు.

సంక్షిప్తం

అనాథ బాలుడి గుర్తింపు

నిర్మల్ పట్టణం: చిన్నతనంలోనే అమ్మానాన్నను కోల్పోయి యాచకుడిగా మారిన అనాథబాలుడిని చైల్డ్‌లైన్ సిబ్బంది సోమవారం గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ గ్రామీణ మండలానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ వద్ద ఉంటున్నాడు. అతడితో కలిసి భిక్షాటన చేస్తున్నాడు. మూడురోజులుగా సోన్ మండలంలోని బొప్పారంలో యాచిస్తూ ఒంటరిగా గడుపుతున్న ఈ బాలుడి గురించి సమాచారం అందుకున్న 1098 సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి ఆదేశాలతో భైంసాలోని వివేకానంద ఆవాసంలో అతడికి ప్రవేశం కల్పించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎం.డి. వాహిద్, సభ్యులు శ్రీలత, సైమన్ సుందర్, అనిల్‌కుమార్, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలి

కడెం: డీఎస్సీలో జరిగిన లోటుపాట్లను సవరించి నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కడెంలో బాధిత అభ్యర్థులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ. డీఎస్సీలో అర్హత సాధించిన గిరిజన అభ్యర్థులు అధికారుల తప్పిదాలతో ఉద్యోగం సాధించలేక పోయారన్నారు. మంచి ర్యాంకు వచ్చి ముగ్గురు గిరిజన అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో చేర్చి వారికి అందులో ఉద్యోగం కేటాయించి ఉంటే గిరిజన అభ్యర్థులు మరో ముగ్గురికి రిజర్వు కేటగిరిలో ఉద్యోగాలు వచ్చేవన్నారు.

రేపు ప్రజాగళం సభ

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాలని ఈనెల 16న స్థానిక పోచమ్మ మందిరం వద్ద ఏర్పాటు చేస్తున్న 'ప్రజాగళం బహిరంగ సభను' విజయవంతం చేయాలని ఐకాస సభ్యులు కోరారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలను చైతన్యపరుస్తూ కర పత్రాలను పంపిణీ చేశారు.

కళాశాలకు విరాళం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978-2023 మధ్య ఇంటర్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50,923 చెక్కును సోమవారం కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ హమీద్‌కు అందజేశారు. ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా మిగిలిన డబ్బును కళాశాల అవసరాలకు వినియోగించేలా అందజేశామని తెలిపారు.

గోదాం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

ముథోల్: మార్కెట్‌యార్డు, గోదాం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచి రాజేందర్ మాట్లాడుతూ మార్కెట్‌యార్డు నిర్మాణానికి కొనుగోలు చేసిన స్థలం ప్రభుత్వ ఆస్తిగా రికార్డులో నమోదై ఉందని పేర్కొన్నారు. దాన్ని మార్కెట్‌యార్డు నిర్మాణానికి ఉపయోగించడం కష్టంగా ఉందన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

నిర్మల్: బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్ అన్నారు. సోమవారం ఎస్‌బీఐ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ముద్ర, స్టాండప్ పథకాలలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళా లబ్ధిదారులకు రుణాలు, 12 ఆటోలు, మూడు కార్లు అందజేశారు. పరిశ్రమల శాఖ జిల్లా మేనేజరు నరసింహారెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రాజేశ్వర్‌గౌడ్, ఎంఎస్ఎంఈ ముఖ్య ప్రతినిధి అశోక్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

'వర్గీకరణపై ఎమ్మెల్యే వైఖరి సరికాదు'

కడెం: ఎస్సీ వర్గీకరణపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పును అందరూ గౌరవించాల్సిందేనని, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఎస్సీల మధ్య చిచ్చుపెట్టేలా మాట్లాడడం సరికాదని మాదిగ సామాజికవర్గ నాయకులు పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, నాయకులు కమలాకర్, చిన్నయ్య, భూషణం, రాజనర్సయ్య, మసీదు భూమన్న తదితరులు విలేకరులతో మాట్లాడారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్ఎస్‌సీఎస్ ఛైర్మన్ దర్మాజీ రాజేందర్ ప్రారంభించారు. డైరెక్టర్‌లు తోట సాయన్న, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: రాజురాలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులు ముత్తగౌడ్, పోతన్న, ప్రవీణ్‌లు ప్రారంభించారు. ఏఈఓ మౌనిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దస్తురాబాద్: ప్రతీ వాహనదారు సంబంధిత వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, రహదారి నియమ నిబంధనలు పాటించాలని ఎస్సై శంకర్ సూచించారు. మండలకేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక


విద్యార్థి అవినాశ్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బాబురావు, ఉపాధ్యాయులు

ముథోల్ : బాసరలోని నాగభూషణ్ విద్యాలయానికి చెందిన అవినాశ్‌కుమార్ అనే విద్యార్థి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాబురావు తెలిపారు. సోమవారం ముథోల్‌లోని దనగర్‌గల్లి కాలనీలో విద్యార్థిని సన్మానించారు. ఇటీవల పఠాన్‌చెరులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో అవినాశ్ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

కుటుంబ బాధ్యతలు మోస్తూ.. నాలుగో ప్రయత్నంలో..


మరమ్మతు పనుల దుకాణంలో పవార్ గౌతం

తానూరు(భైంసా), న్యూస్‌టుడే: తానూరు మండలం జవుల(కె) గ్రామానికి చెందిన పవార్ గౌతమ్ ఎంఏ డీఎడ్ చదివి 2002 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం ఒక్క మార్కు తేడాతో కోల్పోయారు. తాజాగా 2024 డీఎస్సీలో మరాఠీ మాధ్యమ ఉపాధ్యాయుడిగా కొలువు సాధించారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఆయన కుటుంబంలో పెను మార్పులు సంభవించి అనేక బాధ్యతలు మోశారు. ఉపాధ్యాయ కొలువు చేజారడంతో గృహోపకరణల మరమ్మతు పనులు నేర్చుకుని టెక్నీషియన్‌గా పని ప్రారంభించారు. ఇంతలో తల్లిదండ్రులు అకాల మరణం చెందారు. దీంతో కుటుంబ పోషణ బాధ్యతలు చూశారు. తన ముగ్గురు సోదరులను చదివించారు. పెద్ద తమ్ముడు పవార్ రమేశ్‌ను బీఎస్సీ బీఈడీ చదివించగా, అతడు 2009లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. రెండో తమ్ముడు పవార్ విజయ్‌కుమార్ ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసి పోటీ పరీక్షలో 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం పొందారు. మూడో తమ్ముడు విశాల్ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఇన్ని బాధ్యతలు మోస్తూ 2008, 2012 డీఎస్సీలో కొలువు సాధనకు ప్రయత్నించి విఫలమయ్యారు. నాలుగో ప్రయత్నంలో పవార్ గౌతం ఉపాధ్యాయుడి ఉద్యోగం సాధించడంతో కుటుంబంలో ఆనందం నెలకొంది.

ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో నిరసన

నిర్మల్: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్వామిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం ఐకాస ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పాటించిన దుకాణాల బంద్ ప్రశాంతంగా జరిగింది. స్వామిపై చర్యలు తీసుకునేంతవరకు నిరసనలు కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం ఐకాస నాయకులు పాల్గొన్నారు.

రెండు తలల గేదె దూడ జననం

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన రైతు ఆష్టం నడిపి భోజన్న గేదె సోమవారం రెండు తలల దూడకు జన్మనిచ్చింది. గర్భంలోంచి దూడ ఎంతకీ బయటకు రాకపోవడంతో గేదె నొప్పులతో అవస్థలు పడింది. ఇదే క్రమంలో ప్రైవేటు పశువైద్యుడు భోజారెడ్డికి సమాచారం ఇచ్చారు. అతి కష్టం మీద దూడను బయటకు తీయగా రెండు తలలతో ఉంది. దూడ గర్భంలో మృతి చెందినట్లు నిర్ధారించారు.